# జీవిత సత్యం

సాయం సమయం!

ఇంటి ముందు వాకిట్లో పూలమొక్కల మధ్య వాలు కుర్చీలో కూర్చుని... అస్తమిస్తున్న సూర్యబింబాన్ని చూస్తూ.... వేడి వేడి కాఫీ సిప్ చేస్తుంటే... ఎదురుగా టీపాయ్ మీద విప్పని రమ రాసిన ఉత్తరం నా మనసుని ఆనంద తరంగాల్లో ముంచెత్తుతోంది.

కొన్నాళ్ళ తర్వాత.... కొన్నేళ్ళ తర్వాత రమ దగ్గర నుండి వచ్చిన మొదటి ఉత్తరం అది. హైస్కూల్ రోజుల్లో మా మధ్య ఎన్నో ప్రేమ లేఖలు నడిచాయ్. అనుభవంతోపాటు లోక జ్ఞానం కూడా లేక, వచ్చీరాని వయసులో తెలిసీ తెలియని మిడిమిడి జ్ఞానంతో 'నిను చూడక నేనుండలేను' లాంటి ఉత్తరాలు రాసుకున్నాం!

'అవన్నీ ఇప్పుడు గుర్తొస్తే చాలా సిగ్గుగా ఉంటుంది. వేర్వేరుగా కాపురాలు సాగిస్తూ, ఒకరి గురించి ఒకరు ఆలోచించుకుంటూ, జీవితాంతం అలానే మధుర స్మృతులతో గడిపేయగలిగితే చాలు' అనుకునే అమాయకమైన బాల్యం కాదిది...

'మంచం మీద కలవని ప్రేమ... నాన్సెన్స్' అన్న చలం అభిప్రాయాన్ని మనసా వాచా నమ్మిన యవ్వనం! ఇప్పుడు రమ తలపుకు వస్తే మనసంతా తాపంతో నిండిపోతుంది. ఒక్కసారి రమ పొందు దొరికితే జీవితం ధన్యమన్న భావన కలుగుతోంది.

కాఫీ కప్పు టీపాయ్ మీద పెట్టి నెమ్మదిగా ఉత్తరం విప్పాను.

ప్రియ నేస్తం!

ఎలా ఉన్నావ్? నా గురించి ఆలోచించి నీ ఆరోగ్యం పాడు చేసుకోవద్దు. నేను మామూలే.

నువ్వులేని సాయంకాలాలు అందంగా ఎలా ఉంటాయ్? నీతో ఎన్నో అద్భుత స్వర్గాలు ఊహించుకున్న నా జీవితం ముళ్ళ వనంలో పయనిస్తోంది.

ఎన్నో వసంతాలు నీ కోసం వేచి వేచి నీ మౌనంతో విసిగి వేసారి, నీ పిరికి తనానికి పరాకాష్టగా వేరొక వ్యక్తితో తాళి కట్టించుకున్నాను. అయినా నా మనసు నిన్ను తప్పు పట్టలేకపోతోంది. నీ మీద అచంచలంగా పెరిగిన ప్రేమ నా అంతరంగం ముందు నిన్ను నిర్దోషిగానే నిలబెట్టింది.

నీ తలపుల్లో జీవిస్తూ... నీ ఆలోచనలతో విహరిస్తూ... అనుక్షణం అమాయకమైన నీ ముద్దు నగుమోము కోసం తపించే ఈ అభాగ్యురాలికి, ఒక్కసారి నీ దర్శనం గావించు ప్రియా!

ఒక బిడ్డకి తల్లిగా.... ఒక భర్తకి భార్యగా.... ఇటు వంటి దురదృష్టకర ఆలోచన రావడం నిజంగా క్షమించరాని నేరమే! కాని... "తొలి ప్రేమకి బలముందిలే.. అది నీకు మునుపే తెల్సు"!

ఉంటా నేస్తం!

— రమ

ఉత్తరం ముగించే సరికి నా మనసంతా తీరని వేదనతో నిండిపోయింది.

రమ.....రమ....!!

నా తనువులోని అణువణువునా రమే!

కేవలం నా పిరికి తనం మూలంగా మేం ఏకం కాలేకపోయాం. స్నేహితులు భార్యా భర్తలైతే విశ్వసౌందర్యాన్ని చూస్తారట. నేను ఏ మాత్రం ధైర్యం చేసినా ఆ విశ్వసౌందర్యం నా స్వంతమయ్యేది.

అవి మేము హైస్కూల్లో చదివే రోజులు!

మా మధ్య మొదట్లో గొప్ప స్నేహం ఉండేది. మా స్నేహలత పెరిగి పెద్దదై ప్రేమ పందిరికి అల్లుకోవడానికి ఎంతో సమయం పట్టలేదు.

సాధారణంగా ఎవ్వరితోనూ కలవక, నేనేదో నా చదువేదో అన్నట్టుండే నేను రమను ఆకర్షించగలిగాను.

అందానికి నిర్వచనంలా నిత్యం చిరునవ్వుతో చూపరుల్ని ఇట్టే ఆకట్టుకునే రమను ప్రేమించగలిగాను.

మా ఇద్దరికే కనిపించేవి మా రూపాలే. వినిపించేవి మా మధ్య మాటలే! మిగతా వారు ఏం అనుకున్నా మేం పట్టించుకునే వాళ్ళం కాదు.

రమ గొప్ప గాయని కూడా!

ఎప్పుడైనా పాట పాడవూ అని అర్థిస్తే.....

"పాడమనీ... పాట వినే రాజు ఎవ్వరూ..." సుశీల పాటలోని విషాదమంతా తన గొంతులోనే పలికించేది. ఆ పాట విన్నప్పుడల్లా రమ గొంతు నా ఎదలోయల్లో ప్రతిధ్వనిస్తూనే ఉంటుంది.

అటువంటి ప్రేమ మూర్తితో... రాగమయితో... జీవితం పంచుకోలేని ఈ బ్రతుకు వ్యర్థం కదూ!

రమ కూడా అనుక్షణం నా తలపుల్లో వేగుతోంది. ఒక్కసారి మేం 'మమేకం' చెందితే... ఇప్పటి విరహతాపం కొంతైనా తగ్గుముఖం పట్టి, నిత్య జీవితంలో మామా బాధ్యతల్ని సక్రమంగా నిర్వహించగల్గుతాం! లేకపోతే ఇలానే ఆలోచనలతో కృంగి కృశించి మాడి, మసై పోవాల్సిందే!

ఎప్పటికైనా బూడిదైపోయే ఈ శరీరాలు 'అపవిత్రం' చెందడంతో తప్పేముంది?! అందులో ఎంత అనుభూతి ఉంది? ముసురుకున్న చీకటితో ఆలోచన్లు బెదిరిపోయాయ్!

• • • • • • • • •

ఆ రోజు ఆఫీసులో కూమన్నా నన్న మాటేగాని నా మనసంతా గడియారం మీదే లగ్నమైంది.

అప్పటికే ఎన్నోసార్లు చదివిన ఉత్తరాన్ని మరోసారి విప్పి చదివాను.

అది రమ ఎంతో అపురూపంగా రాసిన ఉత్తరం!

లోగిశ లక్ష్మీనాయుడు

"ప్రియనేస్తం!"

ఓ వారం రోజులు గడపడానికి అమ్మదగ్గరికి వస్తున్నాను. వారం రోజులూ... నీ కళ్ళలోని చల్లదనం ఆస్వాదించడం కోసం.... నీ మాటల్లోని మాధుర్యాన్ని చవి చూడ్డం కోసం... నీ ఒడిలో తలపెట్టుకుని ఈ బాహ్య ప్రపంచాన్ని మరిచిపోవడం కోసం... వస్తున్నా ప్రియా! నా ఆశ నెరవేరుస్తావు కదూ?!

— రమ

ఉత్తరం మడిచి జేబులో పెట్టాను. జాలిలేని కాలం కరాళనృత్యం చేస్తోంది.

నెమ్మదిగా నాలుగైంది!హుషారుగా లేచాను.

ఇంటి కెళ్ళేసరికి శ్రీమతి ముక్కుతూ.. మూల్గుతూ అసహనాన్ని పిల్లల మీద చూపిస్తోంది. మా బుజ్జిగాడు ఆరున్నొక్కదాగాన్ని అందుకుని, పెంకుల్ని ఎగరగొట్టే ప్రయత్నం చేస్తున్నాడు.

శ్రీమతి రుసరుస లాడుతూనే కాఫీ అందించింది.

ఆవిడ తత్వమే అంత! ప్రమోషన్ వచ్చినా, ఛార్జిషీట్ ఇచ్చినా ఒక్కలాగే ప్రవర్తిస్తుంది. పెళ్ళయిన తర్వాత నవ్వుతూ టీ కప్పుతో ఎదురొచ్చి స్వాగతించిన రోజుల్ని వేళ్ళమీద లెక్కపెట్టొచ్చు!

గబగబా స్నానించి బయటపడ్డాను.

మా సంకేత స్థలమైన గణపతి ఆలయం మీద పావురాలు సాయం సమయానికి గుర్తుగా గూళ్ళకి చేరుతున్నాయ్.

మట్టూ పచ్చటి కొండలు... అప్పుడప్పుడూ వచ్చిపోయే వాహనాల శబ్దం. పది సంవత్సరాల క్రితం ఎలా ఉందో, ఇప్పటికీ అలానే ఉంది ఆ ప్రదేశం. వచ్చిన మార్పల్లా మనుషుల్లోనే!

ఐదు సంవత్సరాల బాబు... ఆలయం ఆవరణలో ఆడుకుంటున్నాడు. మండపంలో స్తంభానికానుకుని సుదీర్ఘంగా ఆలోచిస్తున్న స్త్రీ మూర్తిని రమగా పోల్చుకోవడానికి నా కెంతో సమయం పట్టలేదు.

నా గుండె లయ తప్పింది. నన్ను చూసిన రమ కళ్ళు ఆనందంతో తళుక్కున మెరిసాయ్.

అప్పటికీ... ఇప్పటికీ... రమ ఏం మారలేదు. కాకపోతే కొద్దిగా ఒళ్ళు చేసింది. గుండ్రని ముఖానికి అంతంత పెద్ద కళ్ళు, కొటేరేసిన ముక్కుకి వివరన ముక్కుపుడక, నిండైన



బుగ్గలు, చక్కటి వక్షసంపద... లోతైన బొడ్డు స్త్రీలకి అసూయ పుట్టేంతటి శృంగారం రమ అణువణువునా ఇమిడి ఉంది.

రమని ప్రేమ భావంతో చూడాల్సిన నా మనసు, కామ భావంతో చూస్తోందేమిటి?!

అది రమ ఒంపు సొంపుల్లోని అందమా!?

లేక వక్రమైన నా మనసుకి ప్రతిరూపమా?!

వెళ్ళి పక్కన కూచున్నాను.

"ఎలా ఉన్నావ్?" కోయిల కంఠంలా కూసింది.

## ఆయన్నే అడగండి

మీ పేరేమిటండీ అని అడిగినా 'ఖలీద్ మహమ్మద్‌ని అడిగి చెపుతా' అంటోంది జెబాభక్తియార్. ఖలీద్ ఈమె మిత్రుడు, నర్గీస్ చిత్ర నిర్మాత (కొందరు ఈమెను రహస్యంగా పెళ్ళి చేసుకున్నాడని కూడా చెపుతారు) ఏ విషయమైనా అతని నడగందే చెయ్యడంలేదు జెబా భక్తియార్. ఈ గోల భరించలేక పెద్ద పెద్ద నిర్మాతలంతా ఈమెను బుక్ చెయ్యబోయి 'ఎందుకులే' అని మానేశారు.



వాళ్ళ మీదా వీళ్ళ మీదా ఆధారపడి గతంలో చాలామంది నటీమణులు ఇదే విధంగా దెబ్బ తిన్నారు. జెబా కూడా అనవసరంగా చెడ్డ పేరు తెచ్చుకుంటోంది.

"ఎలా ఉంటాను... నీ వైరాగ్యంతో మోడులా ఉన్నాను!" నా గొంతులో నాకే తెలియని విషాదం.

కొన్ని క్షణాలు మా మధ్య నిశ్శబ్దం నర్తించింది.

"రమా....."

"ఊ...."

"నువ్వేమనుకోనంటే ఒకటడుగుతాను!"

"ఒకటేమిటి..... వందడుగుతావనే చూస్తున్నా!"

నా మనసు వశం తప్పుతోంది. కళ్ళలో కోర్కెల కాగడా వెలుగుతోంది. రమ నా కళ్ళకి పెళ్ళయిన స్త్రీలా కనిపించడం లేదు. మేం హైస్కూల్లో చదువుకునే రోజుల్లో చంకన పుస్తకాలు పట్టుకుని అమాయకంగా నవ్వుతూ నడిచే రమే కనిపిస్తోంది.

"రమా...... ఒక్కసారి....ఒక్కసారి నీతో పొందు పంచుకోవాలని..."

నా నోటి నుండి ఆ మాటలు ఎలా వచ్చాయో నాకే తెలియదు. మరుక్షణం నా చెంప ఛెళ్ళుమంటుందన్న నా వూహ నిజం కాలేదు.

ఎదురుగా... చూపులు నేలకి ఆనించి... ఏదో ఆలోచిస్తున్న రమని చూసి ధైర్యం వచ్చింది.

"మానసికంగా మమేకమైన మనం, శారీరకంగా సుఖం పంచుకోవడంలో తప్పులేదు. వచ్చే జన్మలో కలుద్దామంటావా? ఈ జన్మలోనే కలవలేని మనం పునర్జన్మలో కలుస్తామన్న నమ్మకం ఉందా? లేనిపోని సెంటిమెంట్ల కోసం మన సుఖాల్ని బలి పెట్టడం న్యాయం కాదు."

నీకు నీ భర్త దగ్గర, నాకు నా భార్య దగ్గర లభించని సుఖాల్ని మన స్వంతం చేసుకుందాం! జీవితాంతం మోడుల్లా జీవించే జీవితాలపై తొలకరి జల్లులాంటి సుఖం తొంగి చూడనీ..." ఎంతో ఆర్ద్రతతో, ఆశతో, అనునయంగా అడిగాను.

ఒక్కసారిగా... నా చేతిని తన చేతిలోనికి తీసుకుని తన పెదవులతో నా అరచేతిని ముద్దు పెట్టింది.

అది అపురూపమైన భావ సంచలనం!

యుగాల నుండి నాలో నిద్రాణమైన 'కోరిక' భళ్ళున బద్దలైన క్షణం.

తన చేతిని నా చేతి వేళ్ళ మధ్య ఇరికించి, కొన్ని క్షణాలు ఆ కళ్ళల్లో కళ్ళుంచి, అలానే ఉండి పోయాను.

"ఈ క్షణం కోసం... ఎన్నాళ్ళ నుండి ఎదురు చూస్తున్నానో తెలుసా?" రమ తమకంగా అంది.

"చెప్పు రమా! నీలో మమైకం చెందాలనే నా వూహని నిజం చేయవూ!" ఆర్తిగా అడిగాను.

నెమ్మదిగా నా చేతి నుండి తన చేతి విడిపించుకుని మౌనంగా తల క్రిందికి వాల్చేసింది.

కొన్ని క్షణాలు మౌనంగా గడిచాయి. దూరంగా ఆడుకుంటున్న బాబుని దగ్గరకు తీసుకుని చెప్పింది—

"శ్రీ.... ఇక్కడ నుండి వెళ్లిపోవాలి!"

నా గుండె మీద సమ్మెట పోటులా పడిందా మాట.

నా మెదడులో వేనవేల శతఘ్నుల మోత.

ఆవేశనంగా లేచి రమని అనుసరించాను.

అప్పుడే ఇళ్ళ కెళుతున్న కూలి జనాలు. దూరంగా వాకిరేవు. కొండ మీద నుండి క్రిందికి దిగుతున్న పశువులు...వెనుక కాపర్లు... సింహగిరి కొండ మీద ఎత్తుగా టి.వి. టవర్... చాలా అద్భుతంగా ఉంది వాతావరణం!

మా మధ్య మౌనాన్ని బద్దలు చేస్తూ రమ అంది.

"శ్రీ... నేను రేపే వూరికెళ్ళి పోవాలనుకుంటున్నాను"

ఒక్కసారిగా నన్ను నిరాశ ఆవరించింది.

"నీ ఇష్టం.. నేను నీకు నగ్నసత్యం చెప్పాను.

అందులో నిజం గ్రహించి, నన్ను అపార్థం చేసుకోకపోతే— అంతే చాలు!" అన్నాను.

మర్నాడు—

మా 'మధ్యవర్తి' ఇచ్చిన ఉత్తరం అందుకుని ఆతృతగా విప్పాను.

"శ్రీ... ఎందుకో... పూర్వంలా నిన్ను ప్రియనేస్తం అని సంబోధించలేక పోతున్నాను— క్షమించు.

ప్రేమ ఒక అలౌకికమైన శక్తి. నీచమైన సెక్స్ కోసం దాన్ని అపవిత్రం చెయ్యకూడదు. ఒకరి పట్ల ఒకరికి ఆరాధనా భావం ఉన్నప్పుడు, శరీరాన్ని సుఖపెట్టడం అన్న ప్రసక్తే రాకూడదు. మనసైన మనిషితో ఏకాంతంగా కొన్ని క్షణాలు మనసు విప్పి మాట్లాడుకుంటే... అందులో ఉండే ఆనందం వేరు!

లేదూ... శారీరక సుఖమే కావాలంటే— నాకు నువ్వు, నీకు నేనే అక్కర్లేదు... మనిద్దరం వేర్వేరు వ్యక్తులతో కలిసి సుఖపడొచ్చు!

నన్నూ, నా హృదయాన్ని అర్థం చేసుకునే శక్తి ఉంటే మన పరిచయం సాగనీ... లేదంటావా... కలుషితమైన నిన్ను చూడ్డమే పాపంగా భావిస్తూ... ఒక దుర్మార్గుడ్ని... స్వార్థపరుడ్ని... ఇన్నాళ్ళు నిష్కల్మషంగా ప్రేమించినందుకు పశ్చాత్తాపపడి నన్ను నేనే శిక్షించుకుంటాను.

ఉంటాను...

— రమ

ఉత్తరం పూర్తి చేసి స్థాణువులా ఉండి పోయాను. ఇప్పుడు రమ నా కళ్ళకి— పవిత్రమైన ఆలయ శిఖరంలా, ఎన్నటికీ అందుకోలేని ఆకాశహర్మ్యంలా కనిపిస్తోంది.